అడవికి ఆపద కాలం

- వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు
- కట్టడికి అటవీశాఖ ముందస్తు చర్యలు
- 43 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్లు ఏర్పాటు
- కొండకింద గ్రామాల్లో కళాజాత ప్రదర్శనలతో అవగాహన



అటవీప్రాంతంలో మంటలను ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది



అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్న కూలీలు

సీతారామపురం : అడవుల రక్షణ, అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అడవులు ఉండాలనే లక్ష్యంతో పెంపకానికి చర్యలు తీసుకుంటున్నాయి. అయితే కొందరు ఆకతాయిలు, జీవాలకాపర్ల అవగాహన రాహిత్యంతో ఈ లక్ష్యం నెరవేరడం లేదు. వేసవిలో అడవుల్లోకి ఆకతాయిలు నిప్పు రగిలించే పదార్థాలను తీసుకెళ్లడం, జీవాల కాపర్లు ఎండుగడ్డికి నిప్పు అంటించడం వల్ల మంటలు ఎగిసి విలువైన వృక్ష సంపద బూడిదైపోతోంది. మరోవైపు వన్యప్రాణులకు సైతం హాని కలుగుతోంది. పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్‌లోని 43 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఫైర్ బ్లోయర్లను సిద్ధం చేస్తున్నారు. మానవ తప్పిదాలే అడవులకు శాపంగా మారుతున్నాయని గ్రహించి సమీప గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

55,218 హెక్టార్లలో అడవులు

ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని 4 సెక్షన్లు,13 బీట్ల పరిధిలో 55,218 హెక్టార్ల పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. సీతారామపురం సెక్షన్ పరిధిలో 16,214 హెక్టార్లు, కృష్ణంపల్లి సెక్షన్ పరిధిలో 14,868 హెక్టార్లు, దుత్తలూరు సెక్షన్ పరిధిలో 10,559 హెక్టార్లు, ఉదయగిరి సెక్షన్ పరిధిలో 13,665 హెక్టార్లలో అడవులు ఉన్నాయి.

అగ్ని ప్రమాదాలకు కారణాలు

ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఆ సమయంలో చెట్ల ఆకులు రాలిపోయి ఉంటాయి. గడ్డి సైతం ఎండిపోయి ఉంటుంది. ఆ సమయంలో అడవుల్లోకి అటవీ ఫల సాయం కోసం వెళ్లిన గిరిజనులు, సమీప గ్రామాల ప్రజల్లో పొగ తాగే అలవాటు ఉన్న వారు చుట్ట, బీడీ, సిగరెట్, అగ్గిపుల్లలను ఆర్పకుండా పడేయడం వల్ల కింద ఉన్న ఆకులు, గడ్డికి నిప్పు అంటుకుని మంటలను అడవిని చుట్టేసే ప్రమాదం ఉంది. ఆకతాయిల చేష్టల వల్ల కూడా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. అలాగే పశువులు, జీవాల కాపరులు అవగాహన రాహిత్యంతో వర్షాలు పడిన సమయంలో ఇగుర్లు వస్తాయని ఎండు గడ్డికి నిప్పు అంటిస్తుంటారు. దీని వల్ల అడవులు బూడిదవుతున్నాయి.

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఒకప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా మూడు మీటర్ల మేర వెడల్పుతో గడ్డిని తొలగించి ఫైర్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. అడవుల్లో చెలరేగే మంటలను గుర్తించి అదుపు చేసేందుకు ప్రత్యేకంగా 8 మంది ఫైర్‌వాచర్లు, 10 మంది బేస్ క్యాంప్ సిబ్బందిని నియమించారు. వారు అగ్నిప్రమాదాలను గుర్తించి ఫైర్‌బ్లోయర్ల సాయంతో మంటలను అదుపు చేస్తున్నారు. అంతేగాకుండా ప్రస్తుతం అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా మానిటరింగ్ సెల్‌లో అడవులకు సంబంధించిన కోడ్‌ను నమోదు చేస్తారు. అడవిలో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందరికీ ఒక్కసారిగా మెసేజ్ అందుతుంది. తద్వారా అందరూ అప్రమత్తమై మంటలను అదుపుచేసేందుకు కృషి చేస్తున్నారు.

కళాజాత ప్రదర్శనలతో..

అటవీ శాఖ అధికారులు అటవీ సమీప గ్రామాల్లో కళాజాత ప్రదర్శనలతో పాటు వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అడవుల్లోకి నిప్పు రగిలించే పదార్థాలు తీసుకెళ్లరాదని, వంట చేయరాదని, జీవాల కాపరులు అడవుల్లోని ఎండు గడ్డిని తగలబెట్టరాదని, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం నిప్పు రగిలించుట నిషేధమని తెలియజేస్తున్నారు. ఆకతాయిల వల్ల, పశువుల కాపరుల అవగాహన రాహిత్యం వల్ల అడవుల్లో మంటలు చెలరేగి విలువైన వృక్ష సంపద బుగ్గిపాలయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణను బాధ్యతగా భావించాలని కోరుతున్నారు. అటవీ సరిహద్దులో వ్యవసాయ పొలాలు కలిగిన రైతులు వ్యవసాయ వ్యర్థాలు కాల్చే సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అడవిలో అగ్గి పడిన వెంటనే సమాచారం తెలియజేస్తే తగిన పారితోషకాన్ని అందజేస్తామని అటవీ అధికారులు చెబుతున్నారు.



కళాజాతలతో అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు


ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌వాచర్లు, బేస్ క్యాంప్, అటవీ సిబ్బంది ద్వారా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం 43 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్‌ను ఏర్పాటు చేశాం. అధిక భాగం సీతారామపురం, పండ్రంగి బీట్లలోనే ఏర్పాటు చేశాం. కళాజాతలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

–సుగుణ కుమార్‌రాజా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఉదయగిరి.

బాధ్యతగా ఉండాలి



మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎక్కువగా ఉంటాయి. ఆ సమయంలో అడవిలోకి వెళ్లే వారు బాధ్యతగా ఉండాలి. అడవిలో అగ్గిపుల్ల వెలిగించకూడదు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌బ్లోయర్స్‌తో పాటు ఫైర్‌వాచర్లు, బేస్‌క్యాంప్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాం.

– వెంకటప్రసాద్, డీఆర్వో, సీతారామపురం

క్లుప్తంగా

రేపట్నుంచి వెంకటేశ్వర స్వామి ఉత్సవాలు

దుత్తలూరు: మండలంలోని నందిపాడులోని దేవరబోడుపై ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న ఉగాది సందర్భంగా ఉదయం గణపతిపూజ, శ్రీవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 31న ఉదయం పొంగళ్లు, సాయంత్రం 7 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం , రాత్రికి అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. 1న ఉదయం 5 గంటల నుంచి నందిపాడు, రెడ్లదిన్నె, పాపంపల్లి, బొటికర్లపాడు గ్రామాల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్



ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఆడిట్ బృంద సభ్యులు డాక్టర్ కే సుదర్శన్ కుమార్, ఎస్‌కే తమన్నా కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించి తనిఖీ చేశారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను గుర్తించారు. ఆడిట్ నివేదికను కళాశాల ఉన్నత విద్య డైరెక్టర్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు. ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి, వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహులు, ఐక్యూసీ కోఆర్డినేటర్ కేసీ విక్రమ్ పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే



సీతారామపురం: స్థానిక వేదగర్భ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, పాటలు, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. స్కూల్ అడ్మిన్, అకడమిక్ డైరెక్టర్లు పవన్‌కుమార్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఆత్మకూరు(చేజర్ల): చేజర్లలో మైనార్టీ నాయకుడు షేక్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును శుక్రవారం నిర్వహించారు. తొలుత ఇమామ్ షాబాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు, మౌజన్లు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం మామూడూరుకు చెందిన రజనీ అనే వివాహిత అదృశ్యంపై భర్త దయాకర్‌రెడ్డి చేజర్ల పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి బజారుకు వెళ్లిన రజనీ తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, సన్నిహితులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుమలరావు తెలిపారు.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

సీతారామపురం : ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీకార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ భార్గవి సూచించారు. స్థానిక బిట్–1 సచివాలయంలో ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. మార్చి నెలాఖరులోగా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి స్వర్ణ పంచాయతీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్పంచ్ భాగ్యకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయం

సోమశిల: ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అదనపు సాయాన్ని అందజేస్తోందని అనంతసాగరం మండల హౌసింగ్ ఏఈ శరత్‌చంద్ర శుక్రవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు రుణం కింద ఈ అదనపు సాయాన్ని అందజేస్తోందని చెప్పారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు.

రేషన్‌కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి

ఆత్మకూరు(చేజర్ల): రేషన్ కార్డులు కలిగిన లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని చేజర్ల తహసీల్దార్ బీ మురళి సూచించారు. చేజర్లలోని వెలుగు కార్యాలయంలో రేషన్ డీలర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి రేషన్ డీలర్లు లేదా వీఆర్వోల వద్ద అయినా ఈకేవైసీ చేయించుకునేలా చూడాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి పీ మహేష్ కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టరుకు చెందిన రైతులు 485 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 370 బేళ్లను కొనుగోలు చేశారని, వివిధ కారణాలతో 108 బేళ్లను తిరస్కరించారని వివరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.250, సరాసరిన రూ.272.94 ధర పలికిందని తెలిపారు. కాగా వేలంలో ఏడు కంపెనీలు పాల్గొన్నాయి

నేడు మహిమలూరులో మెగా వైద్యశిబిరం

ఆత్మకూరు: మండలంలోని మహిమలూరులో శనివారం మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు శ్రీవెంకటేశ్వర మహిమా ట్రస్ట్ చైర్మన్ గుండ్రా పద్మావతి శుక్రవారం తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌ఓ సుజాత, ఆర్డీఓ పావని తదితరులు హాజరవుతారని తెలిపారు. అపోలో ఆస్పత్రికి చెందిన వైద్యులు ఉచితంగా రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తారని చెప్పారు. తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్య సిబ్బంది రెండు మొబైల్ వాహనాల ద్వారా మహిళలు, పురుషులకు వేర్వేరుగా కేన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిమలూరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న డయాలసిస్ సెంటర్ ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో పాటు వైద్యాధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాలలో ఉన్న డయాలసిస్ రోగులకు ఎంతో ఉపయోగపడనుంది.

ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ఉదయగిరి : ఉదయగిరి డిపో ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డిపో అధ్యక్షుడిగా షేక్ మహ్మద్‌రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీవీ కృష్ణయ్య, కార్యదర్శిగా డీ పెంచలయ్య, జాయింట్ సెక్రటరీగా గోపాలకృష్ణ, సభ్యులుగా వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్, అశ్వనీకుమార్, ఎస్‌కేఎం బాషాను ఎన్నుకున్నారు. కాగా సంఘ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి జీ నారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీ ప్రజా రవాణ శాఖలో సాంకేతిక కారణాలతో మూడేళ్లుగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం లేదన్నారు. ఫలితంగా చాలామంది ఉద్యోగులు పదోన్నతులు లేకుండానే ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి పదోన్నతలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంధన పొదుపులో వెనకబడి ఉన్నారని డ్రైవర్లు, కండక్టర్లపై వేధింపులను అధికారులు మానుకోవాలన్నారు. రూట్ సర్వేలు జరపాలని, ప్రభుత్వ సహకారంతో అక్రమ రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈయూ జిల్లా కార్యదర్శి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు మాల్యాద్రి, రమేష్, ఏ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బిట్రగుంట: క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

బిట్రగుంట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్‌ఎస్సార్ కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతలలోని ఆర్‌ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో 17వ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వివిధ రకాల క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కావలి జవహార్ భారతి డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ పీ ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, మానసిక ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. అనంతరం కళాశాల స్థాయితో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి, ఏఓ ఆర్వీ రమణా రెడ్డి, పీడీ ఏ కిరణ్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు(చేజర్ల): వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరిచిన అంశాలను చదివి వినిపించారు. అనంతరం పలువురు సర్పంచ్‌లు తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ఏప్రిల్‌లో నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించనుందని, నూతన గృహాలకు దరఖాస్తులను స్వీకరిస్తోందని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జెడ్పీటీసీ పీర్ల పార్థసారధి, మాజీ ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతి నాయుడు, కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు ఆవుల వెంకటేశ్వర్లు, బలరామిరెడ్డి, కె వెంకటేశ్వర్లు, చిరంజీవి రెడ్డి, తహశీల్దారు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సురేష్

వింజమూరు(ఉదయగిరి): ప్రజాసమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి నియోజకర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు తావివ్వొద్దని సూచించారు. అనంతరం చాకలికొండ, కాటేపల్లి పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.12 లక్షల విలువ చేసే రెండు ట్రాక్టర్లను సర్పంచ్‌లకు అందజేశారు.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి

ఉదయగిరి: బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని ఎన్నికల సీనియర్ సహాయకుడు షేక్ అర్షాద్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జహీర్‌బాబు అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలోని మరణించిన వారు ఓట్లు, డబుల్ ఎంట్రీలు ఉన్నా తొలగించాలని సూచించారు. ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ అలీం, తదితరులు పాల్గొన్నారు.

మార్చురి స్థలం కబ్జాకు యత్నం



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అనుబంధంగా శిథిలమై ఉన్న మార్చరీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడు. శుక్రవారం స్థలం ఆక్రమణ పనులు ప్రారంభించారు. ఓ మహిళ పేరుపై దొంగ పట్టా సృష్టించి దానిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా సమాచారం. ప్రభుత్వ అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ అపహరణ

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఖాన్‌సావలీ దర్గా వద్ద నిలిపి ఉంచిన మోటార్‌సైకిల్‌ను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి అహ్మద్ ఉదయం బైక్‌ను దర్గా వద్ద ఉంచాడు. మధ్యాహ్నం వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పరిసర ప్రాంతాల్లోని సీసీపుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది ఆస్థానానికి ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం రోజున ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆలయ 13వ వార్షికోత్సవం కూడా అదేరోజు కావడంతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని దేవదేవేరుల మూలవిరాట్టులకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా ఉగాది ఆస్థానం సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్ల వద్ద చలవపందిళ్లతో పాటు భారీ దేవతామూర్తుల కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు.

రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి

దుత్తలూరు: రైతులు గడువు తీరిన రుణ బకాయిలను వెంటనే చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కమ్మవారిపాళెం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులు కోరారు. మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీలో సర్వజన మహాసభను శుక్రవారం నిర్వహించారు. సొసైటీ లావాదేవీలపై చర్చించి ఆమోదించారు. గడువు తీరిన బకాయిలు కలిగిన రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి సొసైటీలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇకపై అన్నీ లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లోకనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.75 కోట్లతో చెన్నూరు చెరువు అభివృద్ధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి: చెన్నూరు చెరువును గ్రామకొలను పథకం కింద రూ.1.75కోట్లతో అభివృద్ధి చేయడంతో పాటు సుందరీకరించనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. దగదర్తి మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. రూ.2.07 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బోడగుడిపాడు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. కాట్రాయపాడు, బోడగుడిపాడు, మనుబోలుపాడు, మారెళ్లపాడు, దుండిగం, ఐతంపాడు, రంగసముద్రం, సిద్ధారెడ్డిపాళెం, తిమ్మారెడ్డిపాళెం, కట్టుబడిపాళెం, తదితర గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కట్టుబడిపాళెంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. చెన్నూరులో గ్రామకొలను పథకం కింద చేపట్టనున్న చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



జలదంకి: మండలంలో క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సయ్యద్‌లతీఫున్నీసా హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. యువత క్రికెట్ బెట్టింగ్‌ల ఊబిలోకి దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల పట్ల ఆకర్షితులై మోసపోతున్నారని తెలిపారు. తమ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేకం నిఘా ఉంచాలన్నారు. యువత బెట్టింగ్ రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. బెట్టింగ్ నిర్వహించే వారి చేతిలో మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా నారాయణాచార్యుల జయంతి



ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో పుటపర్తి నారాయణాచార్యులు జయంతిని శుక్రవారం నిర్వహించారు. నారాయణస్వామి చిత్రపటానికి కళాశాల అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుటపర్తి చిన్నవయస్సులోనే భారత, భాగవత పురాణాలతో పాటు సంగీతం నేర్చుకుని సంస్కృతంలో శిరోమణి విద్వాన్ డిగ్రీ సాధించారన్నారు. 14 బాషల్లో ప్రావీణ్యం సాధించారన్నారు. సుమారు 140 వరకు రచనలు, గేయాలు వివిధ భాషల్లో అనువాదం చేశారన్నారు. పద్మశ్రీ పురస్కారాన్ని పొందారన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపికృష్ణ, రఘునాథరెడ్డి, సునీత, దుర్గాప్రసాద్, రమేష్, కిషన్‌తేజ, కమలప్రియ, ధనుంజయ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి



ఆత్మకూరురూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పైపులైన్ల లీకేజీలు, మోటార్లు, చేతిపంపులు మరమ్మతులకు గురై ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాగుచేయించాలన్నారు. ఈఓపీఆర్డీ డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ పాల్గొన్నారు.